www.teluguone.com

# సంకురాత్తుళ్ళు

-బి.ఎన్.మూర్తి

సంక్రాంతి నెలంతా... ముంగిట్లో ముగ్గులు పూయిస్తున్న ముద్దరాళ్ళు కనిపిస్తుంటారు. ముఖ్యంగా.. వొలికిపోయే ఈ వయ్యారాలు పల్లెటూళ్లలోనే కన్నుల పండువగా కనిపిస్తాయి!

కుచ్చిళ్ళు పైకెగదోసి, నడుములో గుచ్చి.. పైట బిగకట్టి, నేలపై ముగ్గుల తివాచీ పరుస్తున్న .. పట్టుపరికిణీ, జార్జెట్ ఓణీల పిల్లలు ఇంటింటా.. పరువానికి వచ్చిన పంటచేలల్లా వంగుని ఉంటారు.

రాత్రి భోజనాలు పూర్తి చేసుకుని ఏడుగంటల నుంచి అర్థరాత్రిదాకా.. కళ్ళాపి జల్లే కన్నె బంగారులు.. చుక్కలు పెడుతున్న మెరుపు చుక్కలూ... ముగ్గు సాగబోస్తున్న ముద్దు గుమ్మలూ కనువిందు చేస్తుంటారు.

పక్కింటి అరుగు మీంచో.. ఎదురింటి కిటికీలోంచో ఈ అమ్మాయిల్ని దొంగచాటుగా చూస్తున్న కుర్రకారు.. అమ్మలూ అక్కలూ ఓపిక తగ్గి లోపలికెళ్ళిపోయాక ముగ్గు 'బొమ్మల' మధ్యకి జేర్తారు-

'అద్భుతం' అన్నమాట.. ముగ్గుకో.. ముందున్న ముగ్ధకో ఏదేమైనా.. ఎదుటి పిల్ల బుగ్గల్లో సిగ్గు మొగ్గలేస్తుంది!

పట్నంలో చదువుతున్న ఈ కుర్రగాళ్ళు సెలవలకొస్తూ కొనుక్కొచ్చిన వారపత్రికల్లో ముగ్గుబొమ్మలు అందిస్తూ ముచ్చట్లు మొదలెడతారు.

మర్నాడు గొబ్బిళ్ళు పెడుతూ పాడే పాటపాటలో... 'మొగలీ పువ్వంటి.. మొగుణ్నివ్వావే..'' అంటున్నప్పుడు...

గుండెల్లో పూసిన మొగలిపువ్వు కోసం.. కళ్లు  ఎదురింటి గుమ్మం కేసి తిరిగి.. సిగ్గిల్లటం ఖాయం-

పండగ సెలవలు పూర్తైపోయి.. కాలేజీకి (బస్తీ)కి వెళ్ళిపోయాక.. ఆ సంకురాత్రుళ్ళలో ఎదురింటి పిల్లలతో సాగించిన హీరోలు సరాగాలు మిస్ అయినందుకు.. కొద్దిరోజులు బెంగపెట్టుకోవడం ఖాయం!!

ఇంక- మన హీరోయిన్ కూడా సంక్రాంతి అయిపోయాక గుమ్మం ముందు పెద్ద ముగ్గులు అద్భుతంగా పెట్టినా చూసి, 'అహా-ఓహో' అంటూ.. మెచ్చుకునేవాళ్ళు ఎవరూ లేరు గదా అని.. ముగ్గు గొట్టంతో రెండు లాగులు లాగించేస్తుంది-

హీరో మళ్ళీ ఎప్పుడు పల్లెటూరుకొచ్చినా ఆ ముగ్గుల రాత్రులకున్న ముచ్చట్లుండవ్! అర్థరాత్రి వేళదాకా ధైర్యంగా 'నడివీధిలో ' నిలబడి కబుర్లు చెప్పుకోడాలుండవ్!

పొద్దున్నే గుడ్‌మాణింగ్ సైగల్తో రాత్రి గీసిన ముగ్గుల అందాలు తిలకించడాలుండవ్!

భోగిమంటల్లో పిడకల దండలేసే.. 'అభ్యంజన మంగళాంగి' తాలూకు సమీప దర్శనాలు ఉండవ్!!

ఆ పండగే వేరు - ఆ సందడే వేరు.

పండగ రోజులు ఎప్పుడూ ఉండిపోతే ఎంత బావుణ్ను?! ఆ సంక్రాంతి నెల్లో .. పెంచుకున్న స్నేహమాధురీ భావాన్ని భరించడం ఎలాగో ఇద్దరికీ అర్థంకాదు-

ఇన్నేళ్ళ బట్టీ ఎదురింట్లోనే ఉండే ఈ చింపిరిజుట్టు సీతాలూ- ఆ చీమిడి ముక్కు సిద్ధప్పా ఈ సంక్రాంతి నెల్లో మూర్తీభవించిన తెలుగుతనంలా, మూసపోసిన మొగతనంలా కనిపించడానికి అసలైన కారణం.. ఈ సంక్రాంతి ముగ్గుబంధాలే-

ఆ రోజులు దాటగానే.. ముగ్గులో పడేసిన అమ్మాయి గుమ్మం దాటకుండా దాక్కుంటుంది.

ఆ పై సంక్రాంతికి సదరు హీరోయిన్‌కి వేరేవాడితో పెళ్ళైపోయి, ఆయనతో బాటే సంక్రాంతి పండక్కి పుట్టింటికొస్తుంది-

ఇంక మళ్ళీ ఆ అమ్మాయిని... ఆవిడగారు పెట్టే ముగ్గుల్నీ కూడా చూడకుండా.. కిటికీ తలుపులు- పాత తలపులు బిగించేస్తాం!